క్లుప్తంగా

నేడు వైఎస్సార్ జయంతి, కార్యకర్తల సమావేశం

సైదాపురం: వైఎస్సార్ సీపీ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం వెంకటగిరిలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి అనంతరం ఈ సమావేశంతో పాటు 'బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

జయంతి వేడుకలకు తరలిరండి

చిల్లకూరు: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి వేడుకలకు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్ పిలుపునిచ్చారు. గూడూరులోని తన నివాసంలో సోమవారం పార్టీ నాయకులతో వైఎస్‌ఆర్ జయంతి వేడుకల నిర్వహణ విషయమై మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలల్లో వైఎస్‌ఆర్ విగ్రహాలకు ఘన నివాళి అర్పించడంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

సేవా కార్యక్రమాలతో నేడు వైఎస్‌ఆర్ జయంతి

నాయుడుపేటటౌన్: వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి పురస్కరించుకుని మంగళవారం సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారథ్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక తెలిపారు. వైఎస్సార్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు, అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

సైదాపురం: మండల కేంద్రంలో మంగళవారం మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు రవికుమార్‌యాదవ్ తెలిపారు. .

చిట్టమూరు: వైఎస్సార్ జయంతి వేడుకలు మంగళవారం కొత్తగుంటలో నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

ఆధ్యాత్మికవేత్తలకు వస్త్రాల పంపిణీ

వాకాడు: ముందస్తు గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆచల పరిపూర్ణ ఆశ్రమంలో సోమవారం 20మంది ఆధ్యాత్మిక గురువులకు ఏకరూప వస్త్రాలు పంపిణీ చేశారు. బాలిరెడ్డిపాళెం సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు పాలవలస వెంకట సాయికృష్ణ పూర్ణచంద్రరావు, మీనా, అశ్రిత్, అముక్త కుటుంబ సభ్యుల దాతృత్వంతో ఈ వితరణ చేశారు. దీవి అనంతాచార్యులు, సులభాదేవి(సుభద్రమ్మ), అమలాంబ సమేత పరిపూర్ణానందస్వామి(కొండయ్య) భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బదిలీ టీచర్లకు వీడ్కోలు సన్మానం



చిల్లకూరు: మండలంలోని పారిచెర్లవారిపాళెం జెడ్పీ హైస్కూలు నుంచి బదిలీపై వెళ్లిన టీచర్లు చంద్ర, మంజుశ్రీ, వీవీ కుమార్, ఆదిలక్ష్మి, సురేంద్రను సహచరులు, విద్యా కమిటీ సభ్యులు, గ్రామస్తులు సోమవారం ఘనంగా సత్కరించారు. జ్ఞాపికలు అందజేసి వారి సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో టీచర్లు మాధవయ్య, చంద్రశేఖర్, శ్రీనివాసులు, ప్రజేంద్రరెడ్డి, కామేశ్వరి, మధుసూదన్‌రావు, విద్యుల్లత, సుగుణ, లీల తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



దొరవారిసత్రం: కల్లూరు సచివాలయం పరిధిలోని శ్రీధనమల్లి పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాదర్ మస్తాన్ ఉద్యోగ విరమణ పురస్కరించుకుని సోమవారం సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి మధు, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పశువులకు పచ్చిమేత ముఖ్యం

దక్కిలి: పాడి పోషణకు పచ్చిమేత ఎంతో ముఖ్యం వెంకటగిరి పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీహరి అన్నారు. పశుగ్రాసం వారోత్సవాల్లో భాగంగా మండలంలోని దేవులపల్లెలో సోమవారం పాడి రైతులకు పశుపోషణపై అవగాహన కల్పించారు. పచ్చిమేత పశువులకు ఎంత మేలు చేస్తుందో తెలియజేశారు. కార్యక్రమంలో దక్కిలి పశువైద్యాధికారి కిషోర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ జెండాల ఆవిష్కరణ

దొరవారిసత్రం: ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జెండాలను ఎగురవేశారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. వేణుంబాకం, బూదూరు, అక్కరపాక, బురదమడుగు, ఆర్మేనికండ్రిగ, ఏకొల్లు తదితర గ్రామాల్లో జిల్లా ఎంఆర్‌పీఎస్ ఉపాధ్యక్షుడు నాగేశ్వరావు ఆధ్వర్యంలో నాయకులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. నాయకులు మల్లిఖార్జున్, రామ్మూర్తి, శివ, రాజశేఖర్, దామోదర్, సాయికుమార్ పాల్గొన్నారు.

నాయుడుపేట మండలంలో..

నాయుడుపేట టౌన్: స్థానిక ఎన్ఎస్ఆర్ కాలనీలో ఎంఆర్‌పీఎస్ జెండా ఎగురు వేశారు. కాలనీలో డప్పు కళాకారుడికి డప్పు ఉచితంగా అందజేశారు. అలాగే, మండలంలోని పలు అరుంధతివాడల్లోనూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. నాయకులు గూటూరు హజరత్, గోవిందు వాసు, కే.రవి సారథ్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

వ్యర్థాలకు నిప్పు..

- స్క్రాప్ యార్డు డంప్‌కు నిప్పు పెట్టిన వైనం
- పొగ కమ్ముకుని ఇబ్బంది పడిన చుట్టుపక్కల ప్రాంతాలు
- శ్రమించి మంటలు ఆర్పిన అగ్నిమాపక కేంద్రం సిబ్బంది



కాళంగినదిలో ప్లాస్టిక్ వ్యర్థాలను డంప్ చేసి తగులబెట్టిన దృశ్యం

సూళ్లూరుపేట: కాళంగినది వ్యర్థాలతో కలుషితమై రూపురేఖలు మారుతోంది. ఓ వైపు మున్సిపాలిటీ నుంచి వెలువడే చెత్త డంపింగ్ కుప్పలు, మరోవైపు సూళ్లూరుపేట-నెల్లూరు జాతీయ రహదారిపై ఆర్టీసీ డిపో సమీపంలోని లతికా హోటల్ ఎదురుగా ఉన్న కాళంగినదిలో పలు కంపెనీల నుంచి తెచ్చి పోస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు..ఆరోగ్యానికి చేటు కలిగిస్తున్నాయి. ఈ వ్యర్థాలకు సోమవారం నిప్పు పెట్టడంతో ఆ ప్రాంతమంతా దట్టంగా పొగ కమ్మేసి దుర్వాసన చిమ్మడంతో ఊపిరాడక ఇబ్బందులు పడారు. సమాచారం చేరవేయడంతో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. మంటలను ఆర్పడానికి సుమారు రెండుగంటల పాటు శ్రమించాల్సి వచ్చింది. కీర్తి ఎన్‌క్లేవ్‌కు ఎదురుగా స్క్రాప్ యార్డు వుంది. ఈ యార్డు నుంచి వ్యర్థాలుగా వచ్చిన వాటిని కాళంగినదిలో డంప్ చేసి కాల్చివేయడంతో నదిలోని నీళ్లు కలుషితమవుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను పట్టణానికి దూరంగా తీసుకెళ్లకుండా జనావాసాల్లో వేయడమే కాకుండా నదీ గర్భంలో వేసి తగులబెట్టడం వల్ల జాతీయ రహదారిపై వెళుతున్న వాహనాలు, పాదచారులకు ప్రమాదకరంగా మారింది. అంతేకాకుండా వాతావరణం, నదిలోనీ నీరు కలుషితమై ప్రజల ఆరోగ్యానికి చేటు కలిగిస్తోందని జనవిజ్ఞాన వేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి నదికి విముక్తి కల్పించాలని, ఇక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను తెచ్చి తగలబెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పేదల సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

చిల్లకూరు: పేద ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటం తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. మండలంలోని నెలబల్లి రెట్టపల్లెలో సోమవారం మండల ద్వితీయ మహాసభను నిర్వహించారు. మురళితోపాటు తిరుపతి జిల్లా వ్యవసాయకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ ప్రభాకర్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చడం లేదని, దీనిపై పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చిన పెంచలయ్య, ఎస్.కుమార్, సీవీఆర్ కుమార్, నారాయణ, రాఘవయ్య, మస్తానయ్య, సీపీఎం నాయకులు ముత్యాలయ్య పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు డుమ్మా కొట్టిన అధికారులు



నాయుడుపేట తహసీల్దార్ కార్యాలయంలో ఇలా...

నాయుడుపేట టౌన్: స్థానిక తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. తన కార్యాలయంలో తహశీల్దార్ మాగర్ల రాజేంద్ర, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, వ్యవసాయాధికారి గణేష్ మాత్రమే ఉండగా, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సురేష్, ఈఓపీఆర్‌డీ గోపాల్, ఏపీఎం, ఏపీఓలతో పాటు మరో నలుగురు అధికారులు మాత్రమే వచ్చారు. హాజరైన వారిలో కూడా కొంత మంది సంతకాలు పెట్టి గ్రీవెన్స్ పూర్తి కాకముందే వెళ్లిపోయారు. హాజరు కాని అధికారులపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీడీఓ, తహశీల్దార్ తెలిపారు.

కలువాయిలో..

కలువాయి(సైదాపురం): కలువాయి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ తప్పితే ఏ ఒక్కరూ కార్యాలయంలో కనిపించలేదు. కేవలం స్వచ్ఛ భారత్ కో-ఆర్డినేటర్, ఇద్దరు అటెండర్లు, ఒక బోర్ మెకానిక్ మాత్రమే కనిపించారు. అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో అర్జీదారులు నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి ఉంటోంది.

'ఉపాధి' పనులపై విచారణ

కలువాయి(సైదాపురం): మండలంలోని కుల్లూరులో ఉపాధి హామీ పనులపై క్వాలిటీ కంట్రోల్ అధికారి ఖలీల్ విచారణ చేశారు. గ్రామంలోని నల్ల చెరువు, కాలువలపై అధికంగా కూలీల ఖర్చు చేసిన నేపథ్యంలో విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. పని ప్రదేశంలో ఉండే కొలతలకు, ఎం-బుక్‌లో ఉండే కొలతలకు వ్యత్యాసం ఉన్నట్లు విచారణలో తేలినట్లు తెలిసింది. బినామీ మస్టర్ల రూపంలో ఎక్కువ నగదు డ్రా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి.

'ఉపాధి' కల్పించరూ!

కోట: ఉపాధి పనులు కల్పించాలని మండలంలోని చంద్రశేఖరపురం గ్రామస్తులు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ గ్రామ సమీపంలో పనులు కల్పించాలని కోరారు.

కండలేరులో 31.646 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 31.646 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2300, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 70, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా పీర్ల పండుగ



వేణుంబాకం పీర్ల చావిడిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రాపూరులో ఊరేగిస్తున్న పీర్లు

దొరవారిసత్రం/రాపూరు : మొహర్రం పురస్కరించుకుని వేణుంబాకంలో, రాపూరు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి, సోమవారం పీర్ల పండగ ఘనంగా నిర్వహించారు. పీర్ల చావిడిలో పీర్లను ఉంచి ముస్లింలు ప్రార్థనలు చేశారు. పీర్లను మేళతాళాలు నడుమ ఊరేగించారు. అర్ధరాత్రి అనంతరం కులమతాలకతీతంగా అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించారు. నిప్పుల గుండం ఏర్పాటు చేసి తొక్కారు. సాయంత్రం నాలుగు పీర్ల చావిడిలోని అట్లేసాహెబ్, పగ్గాలు, తుడుం, మౌలాలి, మసీదుపేటలోని పీర్ల చావడిలోని పీర్లను మేళతాళాలు మంగళవాయిద్యాలతో రాపూరు వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఎంపీడీఓ

సైదాపురం: తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తామని ఎంపీడీఓ రవీంద్రబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ పలుగొటి పెంచలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, 15వ ఆర్థిక సంఘం నిధులతో తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఏఓ హైమావతి మాట్లాడుతూ, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల లబ్ధి పొందడానికి రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ, అలాగే పచ్చిరొట్ట విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఉద్యానవన శాఖాధికారి ఆనంద్ మాట్లాడుతూ, మండలంలోని నిమ్మ రైతులకు ప్రత్యేక ఇన్సూరెన్స్ ప్రభుత్వం కల్పిస్తోందని, హెక్టారుకు ప్రతిరైతు రూ.6వేలు చెల్లిస్తే నిమ్మతోట నష్టపోయిన పక్షంలో హెక్టారుకు 1,20,000 చొప్పున సంబంధింత రైతు ఖాతాల్లో జమ చేస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ సుభద్ర, జెడ్పీటీసీ సభ్యుడు చిత్తలూరు పోలయ్య, వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్, ఎంపీటీసీ సభ్యులు ఈశ్వరరాజు, అనంతమడుగు వెంకటరమణయ్య, సుమతి, శిరసంబేటి పద్మమ్మ, నాగరాజు, శ్రీనివాసులు, ఏఈలు, పశువైద్యాధికారులు సుదర్శన్, సుధీర్, మండల వైద్యాధికారి జనార్ధన్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీలో సత్తా చాటిన నెల్లూరు జట్టు



విజేతగా నిలిచిన నెల్లూరు మాస్టర్స్ జట్టు

నాయుడుపేట టౌన్: సౌత్ ఇండియా వెటరన్ ఫుట్‌బాల్ టోర్నీలో నెల్లూరు మాస్టర్స్ జట్టు విజేతగా నిలిచింది. చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఈ టోర్నీలో నెల్లూరుతో పాటు కేరళ, తమిళనాడు, కర్ణాటక జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఫైనల్స్‌లో తమిళనాడు జట్టుపై నెల్లూరుజట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టుకు నాయుడు పేటకు చెందిన గౌస్‌బాషా గోల్ కీపర్‌గా జట్టు విజయంలో తనవంతు భూమిక నిర్వర్తించాడు.

రొట్టెల పండుగకు ముస్తాబైన దర్గా



చిల్లకూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు దర్గాలలో రొట్టెల పండుగను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. నెల్లూరులో రొట్టెల పండుగ జరిగిన మూడవ రోజున స్థానిక దోషాహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగ చేయడం పరిపాటి. ఈ నేపథ్యంలో మంగళవారం రొట్టెల పండుగను నిర్వహిస్తున్నట్లు ముతవల్లి జెబేద్‌బాషా తెలిపారు. చుట్టు పక్కల మండలాల వారితోపాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల భక్తులు దర్గాను దర్శించుకుంటారని ముతవల్లి తెలిపారు.

మహిళలు మామోగ్రామ్ చేసుకోవాలి

వాకాడు: 35 ఏళ్ల దాటిన మహిళలందరూ మామోగ్రామ్ పరీక్షలు చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ వనిత కోరారు. మండలంలోని పూడిరాయిదొరువులో సోమవారం తిరుపతి వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పింక్ బస్‌లో మహిళలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. డాక్టర్ శ్రీనివాసులు, జి.హిమజ, డేనియల్‌రాజ్, పద్మావతి, హరిత, సర్పంచ్ బూదూరు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ విద్యార్థులకు వైద్యపరీక్షలు



విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాపూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి సాయికిరణ్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల వైద్యులు జుఫిషా భాను విద్యార్థుల ఎత్తు, బరువు చూడటంతోపాటు రక్తపరీక్షలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపకులు మీనాకుమారి, రామలింగయ్య, వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం

గూడూరు రూరల్: ప్రకృతి వ్యవసాయంతో పండించే కూరగాయలు, ఆకు కూరలు, పండ్ల వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని వ్యవసాయశాఖ ఏడీ గోపీ నాయక్ అన్నారు. గూడూరులోని గ్రామోద్యోగుల భవనం వద్ద సోమవారం ఏపీసీఎన్ఎఫ్ స్టాల్‌ను ఏర్పాటు చేసి కూరగాయలను విక్రయించారు. వెలుగు ఏపీఎం బుజ్జమ్మ, ఎన్ఎఫ్ఎంటీ తిరుమల, పూర్ణిమ, ప్రమీల, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

గూడూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. గూడూరులోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డివిజన్‌లోని వివిధ మండలాల ప్రజలు తమ సమస్యలపై సబ్‌కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ, ప్రధానంగా భూసమస్యలపై వినతులు వస్తున్నాయన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

గూడూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి నూతనంగా తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 9న నిర్వహించ తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయు గూడూరు పట్టణ ప్రధాన కార్యదర్శి బీవీ.రమణయ్య కోరారు. మండలంలోని నెల్లటూరు, గోగినేనిపురం వద్ద సోమవారం ఏపీఎస్‌బీసీఎల్ జిల్లా స్టోర్స్ హమాలీల సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

బాలాయపల్లి(సైదాపురం): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ డీజే వినీల్‌కుమార్ గ్రామస్తులను కోరారు. మండలంలోని మన్నూరు, నిండలిలో సోమవారం ఆయన పర్యటించారు. చెత్తా చెదారం వీధుల్లో వేయరాదని ప్రజలకు ప్రజలకు చెప్పారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

వెంకటగిరి రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సీఐటీయూ తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం మానహారం నిర్వహించి ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, నిబంధనలకు విరుద్ధంగా సుమారు పదేళ్ల నుంచి మున్సిపల్ కార్యాలయంలో తిష్ఠ వేసిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా జాయింట్ సెక్రటరీ పెంచలయ్య, నాయకులు ప్రసాద్, సుబ్బయ్య, సుబ్రమణ్యం, రమణయ్య పాల్గొన్నారు.